క్లుప్తంగా

వైభవంగా గంధమహోత్సవం



గంధాన్ని తీసుకొస్తున్న ముస్లిం మత పెద్దలు

సంగం: మండలంలోని దువ్వూరు ఆస్తానా ఏ నూరియా దర్గాలో శనివారం గంధ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మేళ తాళాల నడుమ గంధాన్ని గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకువచ్చారు. గంధం ఆస్తాన ఏ నూరియాకు చేరుకున్న అనంతరం ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంధ మహోత్సవాన్ని తిలకించారు. గంధ మహోత్సవానికి వచ్చిన భక్తులకు గంధాన్ని పంచిపెట్టి ప్రసాద వితరణ చేశారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో హజరత్ అల్ హజ్ షేక్ బాషాసాహెబ్ నూరి, ఆస్తాన ఏ నూరియా కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉదయగిరి జిల్లా సాధనే ధ్యేయం



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా సాధన కమిటీ

ఉదయగిరి: ఉదయగిరి జిల్లా సాధనే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పోరాటం సాగించాలని జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ కె.వేణుగోపాల్ అన్నారు. ఆయన శుక్రవారం రాత్రి మండలంలోని కృష్ణంపల్లిలో రచ్చబండ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున జిల్లా సాధనకు సానుకూల సమయం ఇదేనన్నారు. రాజకీయ నాయకులను, అభ్యర్థులను ప్రజలు డిమాండ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ఉదయగిరి ప్రాంతం జిల్లా సాధించుకోవడం ద్వారా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం నినాదాలతో కూడిన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు దస్తగిరి అహ్మద్, షేక్ ఖాదర్‌బాషా, వీరారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు: కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా బీడీ కార్మికుల, సున్నపురాయి, ఐరన్, మైకా కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆత్మకూరు బీడీ కార్మికుల సంక్షేమ వైద్యశాల డాక్టర్ ఎస్.రూపేష్ తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో చదివే 1వ తరగతి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు ఇంటర్, ఐటీఐ, డిగ్రీ కోర్సులు చదివే విద్యార్థులకు ఉపకార వేతనాలు పొందేందుకు అవకాశం ఉందన్నారు. నవంబరు 30వ తేదీ లోపల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఐటీఐ, ఇంటర్ డిగ్రీ, తదితర ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు డిసెంబరు 31వ తేదీ లోపల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. వివరాలకు పట్టణంలోని టెంకాయతోపులోని డిస్పెన్సరీలో సంప్రదించాలని కోరారు.

ధ్యానం ద్వారా శారీరక, మానసిక ప్రయోజనాలు

వింజమూరు (ఉదయగిరి): ధ్యానం ద్వారా శారీరకంగా, మానసికంగా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ధ్యాన మాస్టర్ అల్లాభిక్షు చెప్పారు. వింజమూరులోని శ్రీ వేదవ్యాస విశిష్ట పిరమిడ్ ధ్యాన మందిరంలో శనివారం పలు అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధ్యానం ద్వారా శరీరం కాంతి వంతంగా మారుతుందని, ఎన్నో వ్యాధులకు దూరంగా ఉండొచ్చన్నారు. ప్రతి రోజూ ధ్యానం చేయడంతో క్యాన్సర్ వంటి మహమ్మారిని కూడా జయించవచ్చన్నారు. ధ్యాన మందిర ప్రాంగణంలో భోజనశాల, ధ్యాన మందిరం, వంటగది, తదితర భవనాలకు భూమి పూజ చేశారు. పలు ఆధ్యాత్మిక పుస్తకాలు భద్రపరిచేందుకు సరస్వతి ప్రాంగణం పేరుతో నూతన భవనానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ధ్యాన గురువులు సుబ్బారెడ్డి, తిరుపాలు, ధనుంజయ, తిరుపతిరావు, నారాయణరెడ్డి, హేమలత, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బత్తల కృష్ణయ్య



బత్తల కృష్ణయ్య

చేజర్ల: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా చేజర్లకు చెందిన బత్తల కృష్ణయ్య నియమితులయ్యారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి ఆయన్ను శనివారం నియమించారు. చేజర్ల మండలం బోడిపాడు గ్రామానికి చెందిన బత్తల కృష్ణయ్య కార్యకర్తగా తన జీవితాన్ని ప్రాంభించారు.

ఆక్రమణలో ఉప కాలువలు

- ఆయకట్టు ఉనికి ప్రశ్నార్థకం



చెరువుకు వచ్చే ఉప కాలువ పూడికతో నిండిపోయిన పరిస్థితిని కాలువలోకి దిగి చూపిస్తున్న మహిమలూరు రైతులు



బసవరాజుపాళెం చెరువు ఉప కాలువలో ఏపుగా పెరిగిన జమ్ము, పిచ్చిచెట్లు

ఆత్మకూరురూరల్: సోమశిల జలాశయం ఉత్తర కాలువ కింద 23వ కి.మీ. నుంచి ఆత్మకూరు మండలంలోని బీడు భూముల సాగు కోసం నిర్మించిన ఉప కాలువలు సైతం ఆక్రమణలకు గురవుతుండడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. తొలుత వందల ఎకరాల్లో పంటల సాగుకు కాలువలు నిర్మించగా ప్రస్తుతం పెరిగిన ఆయకట్టుకు సరిపడ ఉప కాలువల ద్వారా సాగునీరు సరఫరా కావడంలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. నాలుగేళ్ల క్రితం ఉప కాలువలు పూడికలు తీయించిన సోమశిల ప్రాజెక్ట్ అధికారులు ఆ తర్వాత పట్టించుకోకుండా వదిలేయడంతో పడరాని పాట్లు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ప్రధానంగా 27 ఆర్, 29 ఆర్, 33 ఆర్ కాలువల కింద రామస్వామిపల్లి ప్రాంతంలో కొందరు రైతులు ఉప కాలువల స్థలాన్ని సైతం ఆక్రమించి తమను భూముల్లో కలిపేసుకోవడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా తయారైందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. 27 ఆర్ ఉప కాలువ వద్ద నుంచి 250 ఎకరాలకు సాగునీరు అందించే ఉద్దేశంతో అప్పట్లో నిర్మించిన కాలువలు ప్రస్తుతం వెయ్యి ఎకరాలకు ఆయకట్టు విస్తీర్ణం పెరిగినా అధికారులు ఆ మేరకు అవసరమైన విస్తరణ పనులు చేపట్టకపోవడంపై వారు తీవ్రంగా మదన పడుతున్నారు. ఇటీవల ఉప కాలువలకు సమీపంలో పొగాకు నారుమళ్లు, మాగాణి కయ్యలు తయారు చేసి అక్కడ నుంచి వెళ్లే వ్యర్థపు నీరు కాలువల్లోకి చేరేలా కొందరు రైతులు చేసిన పనులు కారణంగా మహిమలూరు, బసవరాజుపాళెం, నారంపేట, కోటపాడు, కరటంపాడు, తదితర గ్రామాల రైతులకు తాగునీటిని తరలించే కాలువలు పూడికతో నిండి పిచ్చి చెట్లు మొలచి మరింత ఇబ్బందికరంగా తయారయ్యాయని బాధిత రైతాంగం గగ్గోలు పెడుతున్నారు. సోమశిల ప్రాజెక్ట్ 4వ డివిజన్ అధికారులు ఉప కాలువల పూడికతీత పనులు వెంటనే చేపట్టి దురాక్రమణలు తొలగించాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు

హ్యాట్రిక్ విజయానికి సమష్టిగా పనిచేద్దాం

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకునేందుకు రానున్న 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ నేతల నుంచి కార్యకర్తల వరకు సమష్టి కుటుంబంగా పనిచేసి పార్టీని గెలిపించుకుందామని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి ఈ మేరకు దిశా నిర్దేశం చేసిన వ్యూహ, ప్రతి వ్యూహాలపై పార్టీ నాయకులతో శనివారం ఎమ్మెల్యే చర్చించారు. 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా తన గెలుపు కోసం పని చేసిన వారందరికి జీవితాంతం రుణ పడి ఉంటానన్నారు. 2024లో కూడా తన గెలుపు కోసం కృషి చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. విజయసాయిరెడ్డి సమావేశానికి పార్టీలో అందరూ కలిసి పని చేయాలని మంచి ఆలోచనతోనే చాలా మంది వచ్చారన్నారు. విజయసాయిరెడ్డి రాను న్న ఎన్నికల్లో కావలి నుంచి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పోటీ చేస్తారని ప్రకటించారని, ముచ్చటగా మూడో సారి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కావలి నుంచి పోటీచేసి హ్యాట్రిక్ విజయం సాధిస్తారంటూ పలువురు నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, పొనుగోటి అనురాధ, జంపాని రాఘవులు, తాళ్లూరు ప్రసాద్‌నాయుడు, దండా కృష్ణారెడ్డి, కుందుర్తి శ్రీనివాసులు, గంధం ప్రసన్నాంజనేయులు, పందిటి కామరాజు, కుందుర్తి కామయ్య, నీలం సాయి కుమార్, అమరా వేదగిరి, పార్టీ వార్డు ఇన్‌చార్జులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడే జైల్లో చంద్రబాబు

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ప్రభుత్వ నిధులను టీడీపీ అధినేత చంద్రబాబు దోచుకున్నారని, దీంతో ఆయన జైల్లో ఊచలు లెక్కిస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. తనపై దర్యాప్తు జరిగితే దొరికిపోతాననే భయంతో సీబీఐ, ఈడీ వంటి కేంద్ర సంస్థలను రాష్ట్రంలోకి రానీయకుండా చంద్రబాబు నిషేధం విధించిన అంశాన్ని గుర్తుచేశారు. తప్పు చేస్తే చట్టం నుంచి తప్పించుకోలేరని చెప్పారు. ప్రజాధనాన్ని ఆయన దుర్వినియోగం చేశారనే అంశాన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థలు సైతం చెప్పాయన్నారు. చంద్రబాబు, లోకేశ్ పీఏలకు సదరు నిధులు చేరాయని, దీంతో వారు దేశం దాటి వెళ్లిపోయారని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టం ముందు అందరూ సమానమేనని పేర్కొన్నారు. కేసుల నుంచి బయటపడాలనే ఉద్దేశంతో చంద్రబాబు తాను దోచుకున్న ప్రజాధనంతో దేశంలోనే పేరుమోసిన న్యాయవాదులకు రూ.కోట్లలో ఫీజులు చెల్లిస్తున్నారని, ఆయన ఆటలు సాగవని స్పష్టం చేశారు.

రేవూరు వాసి ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

- చెన్నైలో రోడ్డు ప్రమాదం

సోమశిల: అనంతసాగరం మండలం రేవూరు గ్రామానికి చెందిన పాశం వెంకటేశ్వర్లు, మమత కుమారుడు ఇంజినీరింగ్ విద్యార్థి పాశం వినయ్ (21) చెన్నైలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శనివారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన పాశం వినయ్ చెన్నైలోని సవిత ఇంజినీరింగ్ కళాశాలలో ఫైనల్ ఇయర్ సీఎస్ఈ చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి బైక్‌పై అతివేగంగా మలుపు తిరుగుతుండగా ప్రమాదం జరగడంతో విద్యార్థి తలకు తీవ్ర గాయమైంది. దీంతో ప్రమాద స్థలంలోనే పాశం వినయ్ మృతి చెందాడు. కుమారుడి మృతి సమాచారాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. రేవూరులో విషాదఛాయలు అలుముకున్నాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆత్మకూరు: పట్టణంలోని క్రిస్టియన్‌పేట, హిల్ రోడ్డు, దళిత కాలనీల్లో ఆదివారం మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ లావణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రిస్టియన్‌పేట, తదితర చోట్ల 5 ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో మరమ్మతుల కోసం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ప్రజలు సహకరించాలని కోరారు.

తాగునీటి పైపులైన్లకు శంకుస్థాపన



బొటికర్లపాడు ఎస్సీ కాలనీకి తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, తదితరులు

ఆత్మకూరురూరల్: మండలంలోని పడకండ్ల పంచాయతీ బొటికర్లపాడు ఎస్సీ కాలనీలో సాగునీటిని పుష్కలంగా అందించేందుకు స్థానిక సర్పంచ్ మాముడూరు నరసింహులు శనివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చొరవతో ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. తమ పంచాయతీలో అన్ని గ్రామాలకు తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తుమ్మల శ్రీనివాసులురెడ్డి, షేక్ నాయబ్‌రసూల్, గుర్రాల వెంకటయ్య, దొడ్ల వెంకటేశ్వర్లు, ఉలవ కొండయ్య, కాంట్రాక్టర్ రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకోండి

సోమశిల: అనంతసాగరం మండలంలోని కుల వృత్తుల లబ్ధిదారులు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఏ మధుసూదన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పడవల తయారీదారులు, కుమ్మరి, స్వర్ణకారులు, శిల్పకారులు, చర్మకారులు, చెప్పులు కుట్టుకునేవారు, తాపీ పనిచేసే వారు, బుట్టలు అల్లే వారు, బొమ్మలు తయారుచేసే వారు, రజకులు, కర్షకులు, దర్జీలు, చేపల వలలు తయారు చేసే వారు అర్హులని తెలిపారు. ఈ దరఖాస్తులు స్థానిక సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ దగ్గర దరఖాస్తు చేసుకోవాలన్నారు. కులవృత్తులకు ఏడు రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు, మొదటి విడతలో రూ.లక్ష, రెండో విడతలో రూ.2లక్షలు రుణ సదుపాయం కల్పిస్తారన్నారు. ఈ అవకాశాన్ని వివిధ కుల వృత్తులకు చెందినవారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఘనంగా అలి ఔలియా దర్గా గంధోత్సవం



బందా నవాజ్ బాబా నివాసం నుంచి ఊరేగింపుగా గుర్రంపై గంధాన్ని దర్గా వద్దకు తీసుకెళ్తున్న దృశ్యం

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం ఖాన్‌సాహెబ్‌పేటలోని అలీ ఔలియా దర్గా 25 గంధోత్సవం శనివారం తెల్లవారుజామున నిర్వహించారు. దర్గా పీఠాధిపతి బందా నవాజ్ బాబా (గోపిదేసి హజరత్తయ్య) నివాసం నుంచి గంధాన్ని ఊరేగింపుగా దర్గా ప్రాంగణం వరకు తీసుకెళ్లారు. పీఠాధిపతి గుర్రంపై ఊరేగింపు గంధం తీసుకుని దర్గా ప్రాంగణంలోని హజరత్ సయ్యద్ ఖాజారంతుల్లా దర్గాతో పాటు కసుమూరు దర్గాలో ఉత్సవం నిర్వహించారు. గలేపులు కప్పి భక్తులకు గంధం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, విద్యుత్, వైద్య, తదితర రంగాలకు చెందిన డాక్టర్లు, తహసీల్దార్లు, ఇంజినీర్లు తమ సిబ్బంది, కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనడం విశేషం.

ఉపాధి హామీ గ్రామసభలు



గ్రామసభలో వివరాలు వెల్లడిస్తున్న డీఆర్పీ

ఉదయగిరి: మండలంలోని శకునాలపలి, జి.చెరువుపల్లి పంచాయతీల్లో శనివారం సామాజిక తనిఖీ బృందం అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఆయా పంచాయతీల్లో 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ఆయా పనుల్లో జరిగిన లోపాలు గుర్తించి నివేదికల్లో పొందు పరిచారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గీత, ఎస్సార్పీ వెంకయ్య, టీఏలు మురళీకృష్ణ, రామకృష్ణ, డీఆర్పీలు గోవర్ధన్, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్య శిక్షణ

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీ భారతి సంగీత నృత్య విద్యాలయం ఆధ్వర్యంలో 4వ ప్రపంచ కూచిపూడి నాట్య దినోత్సవం, వెంపటి చిన్న సత్యం 94వ జయంతిని పురస్కరించుకుని కూచిపూడి నృత్యాల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకురాలు అపర్ణా చక్రవర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నేతాజీ టౌన్ హాల్లో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. 2వ బ్యాచ్ నవంబరు 1 నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తామని వివరించారు. వివరాల కోసం 81259 12923, 92900 27243 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పుస్తక పఠనంపై అవగాహన



గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

వింజమూరు(ఉదయగిరి): విద్యార్థులు చిన్న తనం నుంచే పుస్తక పఠనం ద్వారా అపారమైన జ్ఞానసంపద ఆర్జించవచ్చని గ్రంథాలయ అధికారి జ్యోతి కొండయ్య అన్నారు. వింజమూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పుస్తక పఠనంపై శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వింజమూరు గ్రంథాలయంలో ఎన్నో విలువైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, దసరా సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు మహోన్నత లక్ష్యాలు సాధించుకోవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సూచనల మేరకు అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రమాదకరంగా కల్వర్టు



కల్వర్టుపై సగభాగం పైగా కూలిపోయిన రక్షణ గోడ

వరికుంటపాడు: వరికుంటపాడు– తూర్పుబోయమడుగుల రహదారిలో నూతనంగా నిర్మించిన ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. కల్వర్టు రక్షణ గోడలు కూలిపోయి ప్రమాదకరంగా తయారవడంతో వాహనదారులు పాదచారులు ఎప్పుడు ఈ ప్రమాదం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. సుమారు 30 ఏళ్ల క్రితం గండిపాళెం జలాశయ ప్రధాన ఎడమ కాలువపై వరికుంటపాడు–బోయమడుగుల మార్గంలో కల్వర్టు నిర్మాణం చేపట్టారు. ఆ కల్వర్టు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. రక్షణ గోడలు కొంత మేర కూలిపోవడంతో ప్రమాదకరంగా ఉంది. ఆ ప్రాంతంలో రాత్రి వేళ వాహనదారులు ప్రమాదాలు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుకు రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు.

స్టేట్ రిసోర్స్‌పర్సన్‌కు జ్ఞాపికతో సత్కారం



డీఈఓ చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న అందే సురేష్

సోమశిల: జ్ఞానజ్యోతి శిక్షణలో భాగంగా ఆరు రోజుల పాటు శిక్షణ ఇచ్చిన స్టేట్ రిసోర్స్ పర్సన్ అందే సురేష్‌ను ఎంఈఓలు ఎం బాలకృష్ణారెడ్డి, కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జ్ఞాపికతో సత్కరించారు. రాష్ట్ర స్థాయిలో అనంతసాగరం మండలానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చారని, ఇతర మండలాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు అనేక అంశాలను వివరించారన్నారు. అందే సురేష్ కుమార్ సేవలకు డీఈఓ జ్ఞాపికను అందజేశారు.

ఏడీఎఫ్‌లో భాగస్వామ్యులు అవ్వండి



ఏడీఎఫ్ ద్వారా అభివృద్ధి పనుల వివరాలను స్క్రీన్ మీద వీక్షిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి, పలువురు ప్రముఖులు

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి
- నిష్ణాతులైన ఎన్‌జీఓలతో ఎమ్మెల్యే చర్చలు

ఆత్మకూరు: నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ఏర్పాటు చేశామని, తద్వారా దాతల సహకారంతో విద్య, వైద్యం, వ్యవసాయం, పరిశ్రమలు ఏర్పాటు, నిరుద్యోగ యువతకు జీవనోపాధి, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చెప్పారు. అన్ని విధాలా నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు విశేష కృషి చేస్తున్నట్లు వివరించారు. అవకాశం ఉన్న వారు మరింత అభివృద్ధి కోసం ఏడీఎఫ్ ద్వారా సహాయ సహకారాలు అందించి భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. తిరుపతిలోని ఐఐటీ కళాశాలలో శుక్ర, శనివారాల్లో దేశ విదేశాలకు చెందిన వివిధ రంగాల్లో నిష్ణాతులైన ఎన్‌జీఓలతో ఆయన వర్క్‌షాప్ నిర్వహించారు. ఎమ్మెల్యే సహ విద్యార్థులతో పాటు అనేక రంగాల్లో స్థిరపడిన ఎన్‌జీఓలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో అవసరమైన అభివృద్ధి పనులు చేసేందుకు నియోజకవర్గానికి చెందిన ఉద్యోగ, వ్యాపార రీత్యా దేశవిదేశాల్లో ఉంటున్న వారందరిని ఒకే వేదికపైకి తెచ్చి ఏడీఎఫ్ ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే ఇందుకోసం రూ.పది కోట్లు నిధులు, ఏడీఎఫ్ ద్వారా అభివృద్ధి పనులు చేసేందుకు అందజేసినట్లు తెలిపారు. ప్రధానంగా ఏడీఎఫ్ ద్వారా విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ డిజిటల్ క్లాస్ రూములు ఏర్పాటు చేసినట్లు, సీడ్స్ సంస్థ ద్వారా వారికి అవసరమైన శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకొనేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మెట్ట ప్రాంత రైతాంగం ప్రయోజనాల కోసం తీసుకోవాల్సిన కార్యాచరణపై త్వరలోనే రైతు సదస్సు నిర్వహించనున్నట్లు అనుభవజ్ఞులైన రైతులతో ముఖా ముఖి చర్చించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఏడీఎఫ్ ద్వారా అభివృద్ధికి సహకరించేందుకు అనేక మంది ముందుకొస్తున్నారని వారి సహకారంతో ఆయా పనులను కార్యరూపంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం నిష్ణాతులైన ఎన్‌జీఓల సహకారం అవసరమని ఆయన కోరారు. ఈ చర్చలో పలువురు అభివృద్ధికి అవసరమైన సూచనలు, సలహా లు చేశారు. ఈ వర్క్‌షాపులో సీడ్స్ సంస్థ వ్యవస్థాపకులు, మాజీ ఐఏఎస్ అధికారి ఆర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఐఐటీ తిరుపతి కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ సత్య నారాయణతో పాటు పలువురు ఎన్‌జీఓలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సత్కరించిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు



ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎంపీపీలు, జెడ్పీటీసీలు

దగదర్తి (కావలి): కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు శనివారం ఆయన నివాసంలో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి 2024 అసెంబ్లీ ఎన్నికల్లో కావలి నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తారని పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ విజయసాయిరెడ్డి ప్రకటించడంతో ఎమ్మెల్యేను శాలువాలు కప్పి, పూలబొకేలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దగదర్తి జెడ్పీటీసీ తాళ్లూరు స్వరూపారాణి, ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్ నాయుడు, కావలి జెడ్పీటీసీ జంపాని రాఘవులు, ఎంపీపీ కొండమ్మ, బోగోలు మండలం మద్దిబోయిన వీర రఘు, కుందుర్తి కామయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థల వివాదంపై విచారణ



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీదేవి

అల్లూరు: మండలంలోని గ్రద్ధగుంట ఎంపీపీ పాఠశాల స్థలాన్ని వి.శీనయ్య ఆక్రమించారంటూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం తహసీల్దార్ కె.చంద్రశేఖర్, ఎంపీడీఓ శ్రీదేవి, ఎస్సై పి.శ్రీనివాసులు వివాద స్థలాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పాఠశాల స్థలాన్ని ఆక్రమించి ఓ వ్యక్తి తన ఇంటి ప్రహరీ గోడను నిర్మించారని పాఠశాల స్థలం ఎంత వరకు ఉందో అక్కడికి ఆక్రమణ నుంచి తొలగించాలని జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో గ్రామానికి చెందిన దాసరి శ్రీహరి అర్జీని ఇవ్వడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరిశీలనలో పాఠశాలకు సంబంధించి డాక్యుమెంట్లను, స్థలాన్ని ఆక్రమించారంటున్న వి.శీనయ్య ఇంటి డాక్యుమెంట్లను అడగగా వారి వద్ద ఎటువంటి డాక్యుమెంట్లు లేకపోవడంతో పరిష్కరించే మార్గం చూపలేకపోయారు. సర్పంచ్ దాసరి మల్లికార్జున ఈ సమస్య పరిష్కార మార్గం చూడాలని తెలుపగా పాఠశాల అనేది గ్రామంలోని అందరికి సంబంధించి కాబట్టి మూడు రోజుల వ్యవధిలో గ్రామంలోని అందరికీ తెలియజేసి వారందరి అభిప్రాయం మేరకు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వీరేంద్ర పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం ముందస్తు జయంతి వేడుకలు



అబ్దుల్‌కలాం ముందస్తు జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న వక్తలు

వింజమూరు (ఉదయగిరి): మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త అబ్దుల్ కలాం ముందస్తు జయంతి వేడుకలను శనివారం వివేకానంద జూనియర్ కళాశాలలో నిర్వహించారు. పలువురు ప్రముఖులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరంలో ఓ నిరుపేద కుటుంబంలో పుట్టిన అబ్దుల్ కలాం ఏరో నాటికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి ఇస్రోకు అపార సేవలందించారన్నారు. తన వృత్తిరీత్యా పలు అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ లక్ష్య సాధన కోసం నిగ్రహం కోల్పోకుండా అనుకున్నది సాధించిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, రిటైర్డ్ డీఎంహెచ్ఓ మాళిల మాణి, ప్రముఖ సంఘసేవకులు బి.రామచంద్రారెడ్డి, వివేకానంద కళాశాల ప్రిన్సిపల్ మద్దూరు గోపాల్‌రెడ్డి, సర్పంచ్ ఎన్.సుజ పాల్గొన్నారు.